1983 ఉగాది కథానికల పోటీలో రు. 116/-లు కన్సొలేషన్ బహుమతి పొందిన కథ!

# మిత్రలాభం

ఎ. సువర్ణ




"ఓరి అప్రాచ్యుడా, నన్ను తీసికెళ్ళకుండానే పెళ్ళి, ఉపనయనం చేయించి వచ్చేశావుగా!"

రెండు రోజుల కిందట తెనాలి వెళ్ళి ఓ పెద్ద ధనవంతుల ఇంట్లో పెళ్ళి, మరో బ్రాహ్మణుల ఇంట్లో ఉపనయనం చేయించి ఆ మధ్యాన్నం పదకొండు గంటల బస్సుకి వచ్చిన వెంకటశాస్త్రిని పట్టుకుని నాలుగు దులుపులు దులిపింది పర్వతం,

పేరు మాత్రమే పర్వతం!.... ఆకారం మాత్రం అంగుష్టమే! కానీ కంఠం మాత్రం పెద్దదే! హాలులో నుంచి మాట్లాడిన మాటలు వీధి చివరదాకా వినిపిస్తున్నాయి.

వెంకటశాస్త్రి తక్కువేం తినలేదు.... "ఏమే! నేను నిన్ను రావద్దన్నానా? రమ్మని అన్ని విధాల బతిమిలాడినా. రానంటూ, మొండికెత్తి ఇప్పుడు నా మీద ఎగురుతావేం....?" అంటూ ఆమె మీదికి ఒంటికాలిమీద లేచి ఎగిరెగిరి రంకెలేస్తూ పోట్లాడుతున్నాడు.

"ఆహా! పిల్చాడట! పిల్చాడు! ఏదో ఒప్పుకి!"

"ఛీ! నీతో వాదించేకంటే ఆ గోడకేసి తల బద్దలుకొట్టుకోవడం మంచిది........"

అట్లా వాడిగాసాగి పోతున్నది వాళ్ళ వాగ్యుద్ధం. వెంకటశాస్త్రి పిల్లలకు వాళ్ళ పోట్లాట చికాకు కలిగిస్తున్నా, అదొక దినచర్యగా అయిపోవటంవల్ల వాళ్ళెవరూ అంతగా పట్టించుకోకుండా ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటున్నారు.

ఈ పోట్లాట ఇంకాస్త ఎక్కువై ఈవిడ పీడ ఈ ఇంట్లోంచి విరగడవుతే బాగుండునని అనుకున్నవాళ్ళ ఆలోచన ఎప్పుడూ కార్యరూపం దాల్చటంలేదుసరికదా పోట్లాట తాలూకువేడి ఇంకా చల్లారకుండానే ఇద్దరూ వీధి అరుగుమీదచేరి. "వుసే పర్వతం! ఆ వీరభద్రయ్యగారింట పెళ్ళి ఎంత వైభవంగా జరిగిందనుకున్నావు?! శివరామయ్యగారి కొడుకు ఉపనయనం వంటలన్నీ ఎంత రుచిగా వున్నయ్యనుకున్నావు? ముఖ్యంగా పనసపొట్టు ప్రత్యేకంగా కోనసీమ నుంచి తెప్పించి ఆవపెట్టి చేశారు.సగం అన్నం ఆ కూరతోనే తిన్నారనుకో వచ్చిన అతిథులందరూ!"ఆయన చెప్పినమాటలు నోరు తెరుచుకు వింటూ- "మరి వంటకి ఇంతకీ ఎవరు వచ్చారు?" అని అడుగుతూంటే, వెంకటశాస్త్రి భార్య పార్వతమ్మకి.పిల్లలికి అరికాలి మంట నెత్తికెక్కుతుంది.

పార్వతమ్మ వెంకటశాస్త్రిని పెళ్ళిచేసుకుని గృహప్రవేశానికి అత్తారింటికివచ్చినప్పుడు. పొద్దున సత్యనారాయణ వ్రతం అయి మధ్యాన్నం భోజనానికి వచ్చిన అతిథులందరికి విస్తళ్ళువేసి వడ్డన చేస్తున్న భర్త పిలక. ఎర్ర రాళ్ళ దుద్దుల్ను వింతగా చూస్తూ గదిలో కూర్చున్న ఆమె అంతమంది మధ్యలోకి వచ్చి "విందు జరుగుతున్నట్లున్నదే!" అన్న పర్వతాన్ని మొట్టమొదటి సారిగా చూసింది.

"చూస్తే కనపడ్డం లేదూ!" భర్త అడిగాడు.

"అంత తెలివితేటలేవుంటే నన్ను పెళ్ళికి తీసికెళ్ళకుండా వెడతావా నువ్వు!"పర్వతం భర్త నడిగింది.

"వుసేవ్? అట్లా అబద్ధాలాడకే! నేను నిన్ను రమ్మనమని పిలవలేదూ?"

"ఆ....ఆ....పిల్చావులే ఏదో ఒప్పుకి!"

"బొట్టు కాటుక పెట్టి బాజా భజంత్రీలతో పిలవాలా?"

"నాకా అర్హతే వుంటే నీ చేత ఆ మాట అడిగించుకునేదాన్నిరా?"

ఆ తరువాత వాళ్ళ పోట్లాట ఎంతసేపటికి ఆగిందో తెలీదుకాని. ఆ రాత్రి శోభనపు గదిలో అడుగుపెట్టగానే భర్తకి పాలు అందిస్తూనే.... "మధ్యాన్నం ఆ పోట్లాడినావిడ ఎవరండీ" అంటూ అడిగింది పార్వతి.

"ఆ! దాన్నిగురించి చెప్పాలంటే కొల్లేటి చాంతాడంత వుందిలే! ఇట్లాంటి మంచి సమయాన్ని వృధా ప్రసంగాలతో వృధా పుచ్చద్దు .... "అంటూ ఆప్యాయంగా కౌగిట్లోకి తీసుకున్న భర్త కౌగిట్లో గువ్వలా ఒదిగి పోయింది.

కొన్నాళ్ళ తరువాత వెంకటశాస్త్రి భార్యతో "పారూ. పర్వతం మాకు చాలా దూరపు బంధువు-మా చిన్నప్పుడు వాళ్ళింతా ఈ పక్కింట్లోనే వుండేవాళ్ళు. అదీ నేనూ ఒకటి రెండు నెలలు హెచ్చుతగ్గులుగా పుట్టాం.చిన్నప్పుడు గ్రాయకం తెలిసినప్పటి నుంచి ఇద్దరం ఎప్పుడూ కలిసి ఆడుకునే వాళ్ళమనేకంటే. కలిసి పోట్లాడుకునేవాళ్ళమంటేనే సబబుగావుంటుంది.పదిఏళ్ళకూడా రాకుండానే దాన్ని ఒక ముసలాడికిచ్చి పెళ్ళి చేశారు. ఏడాది తిరక్కుండానే ఆయన గుటుక్కుమన్నాడు.

అది పెద్దమనిషి కాగానే దాని అత్తింటివారు. పుట్టింటివాళ్ళు దాని పసుపుకుంకాలు తుడిచెయ్యడమేకాకుండా తలగొరిగించాలని చూస్తే. మా నాన్న వాళ్ళని నానా తిట్లు తిట్టి పర్వతాన్ని మా ఇంటికి తీసుకొచ్చారు. అప్పుడు రావడమే! మళ్ళీ అది పుట్టింటి మొహం చూడలేదు. అమ్మ, నాన్న పోయారు.దాని అన్నలు ఇల్లూవాకిలి అమ్ముకుని పట్నం చేరారే కాని చెల్లెలి గురించి పట్టించుకోనేలేదు ఎవరూ." భర్త చెప్పిన మాటలు పార్వతికి ఎట్లాగో అనిపించినా ఏమీ మాట్లాడలేదు.

అగ్నిలో ఆజ్యం పోసినట్లుగా పార్వతి పుట్టింటివారు "ఇదిగో చూడు పార్వతీ. ఆమె అతగాని తోడపుట్టిన పడుచు కాదు. అతగాడిని అడిగితే మా ఇద్దరిది ప్రాణస్నేహం అంటున్నాడు. ఎందుకైనా జాగ్రత్తగా వుండవే తల్లీ...." అంటూ హెచ్చరించి వెళ్ళారు.

'ఆడవాళ్ళు ఆడవాళ్ళు స్నేహంగా వుంటారు. మగాళ్ళు మగాళ్ళు స్నేహంగా వుంటారు! మరి ఇదేమిటి ఆడ- మగ ప్రాణస్నేహం అంటారు!' అంటూ ఆలోచించిన పార్వతి "సమయం చూసి" పర్వతానికి ఉద్వాసన చెప్పమంటూ తల్లి చెప్పిన సలహా ఆచరించాలని సమయంకోసరం కాచుకున్నది.

"మొన్న అన్నయ్య పెళ్ళిలో మీ ఇద్దరిని గురించి ఏం మాట్లాడుకున్నారో తెలుసునా?" అన్నగారి పెళ్ళి నుంచి తిరిగి వచ్చిన నాలుగో రోజు రాత్రి మెల్లిగా భర్తను కదిపింది పార్వతి.

పరధ్యాన్నంగా వున్న వెంకటశాస్త్రి.... "ఏం అనుకున్నా రేమిటి?" ఎటో చూస్తూ ప్రశ్నించాడు భార్యని. "ఆ మాటలు నా నోటితో చెప్పడానికే అసహ్యంగా వుంది."

"మరైతే చెప్పకు...." ఈ సమయం వదిలిపెడితే మళ్ళీ దొరకదని ధైర్యాన్నంతా కూడదీసుకుని—"ఆ పర్వతంతో మీకేదో అక్రమ సంబంధం వుందని మాట్లాడుతున్నారు." ఆ మాటలకు వెంకటశాస్త్రికి కోపం రాలేదు. అతి శాంతంగా "ఆ అన్నవాళ్ళ పళ్లు రాలకొడితాను" అన్నాడు. భర్త శాంతంచూసిన పార్వతి ఇంకాస్త ధైర్యం తెచ్చుకుని "మీరనేది

### కుందేలూ-తాబేలూ

కుందేలూ, తాబేలూ
వేసుకున్న పందెంలో
తాబేలు గెలిచిందని
అందరికీ తెలుసు
తెలియనివల్లా వాటి పేర్లే
తాబేలుపేరు పోస్టుకార్డు
కుందేలు పేరు టెలిగ్రాము.

—కాశీనాధ & కాశీనాధ

చాలా బాగుంది. పిల్లనిచ్చుకున్నాక వాళ్ళ భయాలు వాళ్ళవి." వెంటనే భార్యనుదగ్గరకు లాక్కుని ఆమె కళ్ళలోకి చూస్తూ "వాళ్ళెవరిగురించి నాకేం అక్కరలేదు. నీకు నామీద ఆ సందేహం లేదుగా !"

"నాకు లేకపోయినా లోకానికి వెరవాలిగా !"

"ఎవరా లోకం ? మీ అమ్మానాన్నలా అన్నవదినలేగా! నామీద నమ్మకం లేనివాళ్ళు నా గుమ్మం తొక్కక్కరలేదు........"

అంతే పార్వతి పుట్టింటివారు ఎన్నడు కూతురి ఇంటిగడప తొక్కనేలేదు. పార్వతి ఆరు పురుళ్ళు పర్వతమే పోసింది.

పార్వతి భర్తతో కాపురం చేసిన ఒక్క సంవత్సరం లోపలే తన భర్త ఏకపత్నీ వ్రతుడని పొరపాటున కూడ పరాయి స్త్రీని ఆ భావంతో చూడలేడని తెలుసుకుంది.

స్త్రీత్వం లవలేశం కూడలేని పర్వతం ఏ పురుషుని ఆకర్షించలేదని కూడ తెలుసుకుని భర్త, పర్వతాన్ని గురించి ఆలోచించడం మానేసి హాయిగా, ప్రశాంతంగా తన కాపురం తను చేసుకునేది.

అర్ధరాత్రి వరకు పర్వతంతో అరుగు మీదో హాలులోనో కూర్చుని కబుర్లు చెపితే మాత్రం భర్తమీద విసుక్కునేది.

వృత్తిరీత్యా వాళ్ళిద్దరికీ చాలా దగ్గర సంబంధం వుంది. తండ్రి ద్వారా వంశపారంపర్యంగా సంక్రమించిన పౌరోహిత్యాన్నే వెంకటశాస్త్రి చేపట్టాడు ఆ వూళ్ళోనే కాక, తెనాలి, విజయవాడవంటి పెద్దపట్టణాలనించి, బాపట్ల, చీరాల, పొన్నూరువంటి ఒకమాదిరి పట్టణాలలోను, కొల్లూరుకి దగ్గరగావున్న క్రావ, వెల్లటూరు, పోతుమర్రు, వేమూరు, జంపనివంటి గ్రామాలలో ఏ శుభ, అశుభ కార్యాలు జరిగినా పౌరోహిత్యానికి వెంకటశాస్త్రినే పిలిచేవారు.

తను పౌరోహిత్యాలకు వెళ్ళేచోటికి పర్వతాన్ని వంటలకి తీసికెడుతుండేవాడు. పర్వతంఎక్కడైనాసరే శుభం కాని, అశుభం కాని వంట చేసినచోట చెయ్యిమాత్రం కడిగేదికాదు.

పొద్దున నవ్వుకుంటూ కలిసి వెళ్ళిన ఇద్దరు సాయంత్రానికి పోట్లాడుకుంటూ తిరిగి వచ్చేవారు. హాలులో చెరోపక్కా నిలుచుని ఇద్దరు హాలులోని పెంకులు ఎగిరిపోయేట్లు అరుచుకుంటూ పోట్లాడుకునేవారు. ఆఖరికి కోపం పట్టలేక పర్వతం తన గదిలోకిపోయి తలుపులు బిడాయించుకునేది. వెంకటశాస్త్రి మొహం కందగడ్డలా అయి ఉయ్యాల బల్లమీద కూర్చుని పెద్దగా వూగుతూ తనకోపం ఉయ్యాల బల్లమీద చూపించేవాడు. మళ్ళీ అరగంటలోనే పర్వతం తలుపులు తీసుకు బయటకు వచ్చి

# పరిచయం



నాలుగు దశాబ్దాల వయస్సువచ్చిన తరువాత కుటుంబంలో జరిగిన కొన్ని అపూర్వ సంఘటనలు నాచేత కలం పట్టించెయ్యి.

జన్మస్థలం తెనాలి. ఏలూరులో స్వల్ప విద్యాభ్యాసం. శ్రీవారి ఉద్యోగరీత్యా ప్రస్తుతం వరంగల్ నివాసం. పిల్లల విద్యాభ్యాస కారణంగా తరచూ హాల్లీ వెళ్ళిరావటం.

అజంతాహి మిల్లులో శ్రీవారు సీనియర్ ఇంజనీరు. ఇద్దరు కుమార్తెలు, ఒకే కుమారుడు. రచనా వ్యాసంగం మిడిల్ ఏజ్ హాబీగా తీసుకుని అనేకరకాల వైవిధ్యం కల రచనలు చెయ్యాలన్నదే నా ధ్యేయం. సంగీతం, సాహిత్యం అంటే నాకు చాలా ఇష్టం. ఎం. ఎస్. సుబ్బులక్ష్మి నా అభిమాన గాయకురాలు. విశ్వనాథగారు, అడివి బాపిరాజుగారు, రంగనాయకమ్మగారి రచనలంటే నాకు చాల ఇష్టం.

నేను వ్రాసిన రెండు కథలు ఆంధ్రజ్యోతి వారే ప్రచురించి నాకు ప్రోత్సాహాన్ని ఇచ్చారు. ఈ సంవత్సరం ఉగాది కథల పోటీలో నా కథకు కన్సొలేషన్ బహుమతి ఇచ్చి రచనా వ్యాసంగంలో నేను మరొక మెట్టు ఎక్కేందుకు చేయూతనిచ్చిన సంపాదక మహాశయులకు, న్యాయనిర్ణేతలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు

—ఎ. సువర్ణ

తనతో తెచ్చిన అరిశలో, అప్పాలో, లడ్లో రమచేతిలో పెడుతూ "నువ్వు, తమ్ముళ్లూ చెల్లెలు తీసుకోండి" అనేది. రమ కిష్టంలేకపోయినా తండ్రికి భయపడి తీసుకునేది.

పెద్ద వాళ్ళయిన రమ, గోపీ పర్వతంతో చీటికి మాటికి వాదనకి దిగేవారు— ఆమెను ఎట్లాగైనా తమ ఇంట్లో నుంచి పంపించెయ్యాలని. రమ ఏదో అన్నదని అంతవరకు వెంకటశాస్త్రి కుటుంబంతో చేభోజనం చేస్తున్న పర్వతం తన గదిలోనే కుంపటి పెట్టుకు వండుకు తినడం మొదలు పెట్టింది.

వెంకటశాస్త్రికి ఆమె విడిగా వండుకు తినడం ఇష్టంలేదు. "చిన్నపిల్ల ఏదో అన్న దానికి నీ కింత పట్టుదలేమిటే ?"

"చిన్న పిల్లేమిటిరా? పెళ్ళి అయితే ఈ పాటికి ఇద్దరు పిల్లల తల్లి అయ్యేది. పెద్ద వాళ్ళను ఎట్లా గౌరవించాలో తెలీకపోతే రేపు ఇది అత్తారింట్లో ఎట్లా కాపురం చేస్తుంది?" "పోనీలేవే! ఇవ్వాల్టికి ఒక్క రోజు తిను. మజ్జిగ పులుసు మహా బ్రహ్మాండంగా వుందిలే!" ఆఖరి అస్త్రం ప్రయోగించాడు.

"ఇష్టంలేని వాళ్ళచేత్తో చేసిన పంచభక్ష పరమాన్నాలు తినే కంటే, సొంతఇంట్లో గంజి కాచుకు తాగడం శ్రేష్ఠం....."


"నీకు తల బిరుసు అహంకారంమాత్రం పుష్కలంగా వున్నయ్య."

"ఏం? నీ కూతురు కంటేనా?"

పర్వతానికి భర్త తరపునుంచి కొంత ఆస్తి వచ్చింది. వాటిలో బాగా డబ్బు సంపాదించిపెట్టేవి కొబ్బరితోట, వడ్లుపండే నాలుగెకరాల మాగాణి. ప్రతి మూడునెలలకు అక్కడికి వెళ్ళవచ్చే పర్వతం షైలే షైలు! మహా షోగ్గావెళ్ళి తిరిగివస్తుంది. గోతంలో పదికొబ్బరి కాయలు మూటకట్టుకొచ్చిన పర్వతం వస్తూనే "పార్వతీ, ఇంద ఈ పది కాయలు తీసి లోపలపెట్టు." అని శాస్త్రితో "వురేయ్, రైతు రెండుబస్తాల బియ్యం లారీకి ఎక్కించాడు. అవి రేపు వస్తయ్య. వెళ్ళి తీసుకొచ్చి నాకో పది కిలోల బియ్యం ఇచ్చి మిగతావి నువ్వుతీసుకో! " అని అంటుంటే అక్కడేవున్న గోపీకి... "అబ్బా! మన కుటుంబాన్ని ఈవిడే పెట్టి పోషిస్తున్నట్లుగా మాట్లాడుతోందే! ఆవిడ వుండే గది అద్దెకిచ్చామంటే నెలకు నలభయ్, యాభయికి తక్కువ కాకుండా అద్దె వస్తుంది. ముప్పయి సంవత్సరాలకుపైగా ఆ గదిలో వుంటోంది. ఏం ఇబ్బంది ?" అంటూ వాళ్ళు మాట్లాడే ఏవరి మాటలూ పర్వతం పట్టించుకునేది కాదు.

"వాళ్ళందరికీ తమ బాల్యం గురించి, స్నేహం గురించి ఏం తెలుసును....?

తామిద్దరు చిన్నప్పటినుంచే ఒక ఇం




విడిచిపెట్టి వుండేవాళ్ళు కాదు. పెద్దవాళ్ళయినతరువాతకూడా తామిద్దరి మధ్య స్త్రీ పురుషాకర్షణ లాంటిదేమీ కలుగలేదు. వాడిని కూర్చోబెట్టి వాడి పిలకకు నూనెరాసి దువ్వి జడవేసేది. జడ చివర పురికొస పెట్టి ముడివేసి దాన్లో పూచిన గన్నేరు. మందారం. పారిజాతం పూలు కోసుకొచ్చి మాలకట్టి పెట్టేది తను. తరువాత ఇద్దరూ ఇదే హాలులో ఈ ఉయ్యాల బల్లమీద కూర్చుని వూగేవారు. మామ్మపాడే జయదేవుడి అష్టపదులు. అన్నమాచార్యుల కీర్తనలు పాడుతూంటే. ఎప్పుడూ నన్ను ఎక్కిరించే వాడు. ఇంకా ఇంకా పాడమనే వాడు. అట్లా కలిసి మెలిసి ఆడుకునే వాళ్ళకి ఎందుకు వచ్చేదో ఇద్దరి మధ్య వాడు నన్ను కోతి. కొండముచ్చు అంటే. నేను వెంటనే వాడిని పందికొక్కు అనేదాన్ని....' ఆనాటి వాళ్ళ బాల్య క్రీడలు తల్చుకు ఎప్పుడూ మురిసిపోతూ వుండేది.

"ఆ రోజు పర్వతానికి పెళ్ళి. పట్టుచీర కట్టుకుని పెళ్ళికొడుకు పక్కన కూర్చున్న పర్వతాన్ని చూస్తే తనకి నవ్వు ఆగక నవ్వేస్తే పీటమీదనుంచి కోపంగా పరిగెత్తుకుంటూవచ్చి 'ఎందుకురా ఆ వెధవ నవ్వు?' అని అడిగింది. 'నీ అవతారం చూస్తూంటే నేనే! నువ్వు పట్టుచీరలో ఎట్లా వున్నావో తెలుసునా? గడకర్రకి చీర చుట్టిపెట్టినట్లుగా వుందే!' అన్న నా మాటలు లెక్కచేయకుండా నేను తింటున్న లడ్డువంక ఆశగా చూస్తూ "వురేయ్ నాకు ఒక లడ్డు తెచ్చిపెట్టరా!' నోట్లో నీళ్ళు వూరుతూ అడిగింది.

"అయ్యయ్యో పెళ్ళికానిదే ఏమీ తినకూడదే!"

"మరి నువ్వెందుకు తింటున్నావురా?"

"ఇది చాలా బాగుందే! పెళ్ళి నాకా. నీకా? పెళ్ళి కొడుకు నీ మెళ్ళో మంగళసూత్రం కట్టేటంతవరకు నువ్వు ఏమీ తినకూడదు. అదుగో అటుచూడు...." అంత గయ్యాళయిన పర్వతం ఆ పెళ్ళి కొడుకుని చూసి దడుసుకుంది. తనని ఎత్తుకుపోయేందుకు వచ్చిన బూచాడు అనుకుంది.

నాలుగు రోజులు పోయాక మళ్ళీ మా ఆటలు ప్రారంభమైనయ్యి.

ఆ రోజు సాయంకాలం చింతచెట్టుకి ఉయ్యాలకట్టి వూగుతున్నాము. వాళ్ళమ్మ పెద్దగా ఏడుచుకుంటూ....'నీ తలరాత ఇట్లా తెల్లారిందికదే,' అంటూ పర్వతాన్ని లోపలికి తీసికెళ్ళటం. మళ్ళీ ఇరవై రోజులదాకా తను కంటపడనేలేదు. అది వచ్చేంత వరకు తనకేమీ తోచేదికాదు.

వాళ్ళిద్దరి దెబ్బలాటలు చూసిన వాళ్ళంతా — "ఈ దెబ్బతో వాళ్ళ స్నేహం అయిపోయింది." అనుకునేవారు. కాని వాళ్ళనుకున్నట్లు ఎప్పుడూ జరిగేది కాదు.

పొద్దున్నే ఎవరింట్లోనో బారసాలకని వెళ్ళిన వాళ్ళు సాయంత్రానికి పోట్లాడుకుంటూ ఇంటికి చేరారు ఇద్దరు.

"వుసే పర్వతం నేను నీవంటకి పదిహేను రూపాయలని మాట్లాడితే, ఇంకో పది ఎందుకే ఎక్కువ అడిగావు?"

"ఏం అడిగితే తప్పా?" "ఆ తప్పే! ఒప్పుకున్న దానికంటే ఎక్కువ అడగడం తప్పుకాదుటే?"

"నేను చేసిన కష్టానికి ఆ మాత్రం తీసుకొనడం తప్పుకాదులే!" "నాతో చెప్పాపెట్టకుండా రేటు ఎక్కువ చెయ్యొచ్చునా? పోయిన నెల రుక్మిణమ్మగారి మనవడి బారసాలకి పదిహేనేగా తీసుకున్నావు. నేను వాళ్ళింట్లో ఎంత తీసుకున్నానో అంతే వీళ్ళింట్లో తీసుకొన్నాను? ఏమైనా ఎక్కువ అడిగానా?"

"నువ్వు రుక్మిణమ్మగారింట్లో బారసాలకి ఏం మంత్రం చెప్పావో అదే మంత్రం వీళ్ళింట్లోనూ చెప్పావు. నేను అట్లాకాదే! రుక్మిణమ్మగారింట్లో పట్టుమని పది విస్తళ్ళయినా లేవలేదు. వీళ్ళింట్లో మొదటి పంక్తిలోనే ముప్ఫైమందికి పైనే కూర్చున్నారు. రెండో పంక్తికి మళ్ళీ గుండిగపెట్టి వార్చేటప్పటికి నా పని అయిపోయిందనే సంగతి నీకు తెలుసునా? నేను పదిరూపాయలు ఎక్కువ తీసుకున్నాననే ఒక్క విషయం మాత్రం నీ కంటికి కనపడింది...."

"ఆ చాల్లేద్దూ ఇంక ఆపు! నీకు ఎక్కువ కావాలంటే నాతో చెప్పు. నేను చెప్పి ఇప్పిస్తాను...." "నీ బోడి సిఫార్సు నాకెందుకురా! నాకు నోట్లో నాలుకలేదా? నేనడగలేనా?...."

"ఆ.... ఆ.... వున్నయ్యిలే! నేను సిఫార్సు చెయ్యకపోతే నిన్నెవరూ పిలవరు తెలిసిందా!" అట్లా సాగిన వాళ్ళ పోట్లాట ఎప్పుడు ఆగిందీ ఎవరికి తెలిసేది కాదు.

పది నిముషాల తరువాత పార్వతి. రమ. గోపి బయటకు వచ్చి చూస్తే ఇద్దరు నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటుంటే. వాళ్ళను చూస్తే వీళ్ళకు భగ్గుమనేది...."నాన్నకసలు సిగ్గేలేదు. ఆవిడగారు సంపాదించేదాంట్లో ఒక్క నయాపైసా మనకివ్వదు. రోజూ పొద్దున్నే ఈవిడను వెంటేసుకు తిరగటం. సాయంత్రం ఈ భాగోతం— మళ్ళీ కాసేపటికే ఆవిడ అన్నమాటలు. తిట్లు అన్నీ మరిచిపోయి పిల్లి పిల్లను ఒళ్ళో కూర్చోపెట్టుకు ముద్దులాడుతున్నట్లు ఆ కబుర్లు చూడు.... ...."

తల్లి మొహం చూసి వాక్యం పూర్తిచెయ్యలేదు. "అమ్మా. ఆరుగురు పిల్లల తల్లివైనావు. నీ పిల్లలు నీ అంత అయినారు. నువ్వు ఈ ఇంట్లో అడుగుపెట్టినప్పుడే ఆవిడకు స్వస్తిచెప్పద్దూ...." కూతురు అడిగిన ప్రశ్నకి ఏమీ జవాబు చెప్పకుండా లోపలికి వెళ్ళిపోయింది పార్వతమ్మ.

రమకి పెళ్ళి వయస్సువచ్చి రెండు మూడేళ్ళుదాటి. పెళ్ళి ప్రయత్నాలు సంవత్సరంనుంచి చేస్తున్నా వెంకటశాస్త్రికి తగ్గ అల్లుడు అంతవరకు దొరకలేదు.

"మా ఇద్దరి స్నేహం ఎట్లాంటిదో మీకెవరికైనా తెలుసుటరా" అనే పర్వతం. గోపి. రమ అన్నట్లుగా వెంకటశాస్త్రికి ఒక్కపైసా ఆర్థిక సహాయం చేసేదికాదు. పైగా డబ్బు విషయంలో మాత్రం మహా ఖచ్చితంగా వుండేది. శాస్త్రికి ఎప్పుడైనా అవసరానికి పాతికో. పరకో ఇచ్చినా కాబూలీ వాలాకు మల్లే ముక్కుపిండి మరీ వసూలుచేసుకునేది. పైగా. "అప్పు స్నేహానికి విరోధి" అని అంటూండేది. బస్సు

చార్జీలకు కాస్త తక్కువైతే వేసినా అది వసూలు చేసుకునేంత వరకు పర్వతానికి నిద్రపట్టేది కాదు.

రానురానూ వెంకటశాస్త్రికి పౌరోహిత్యాలు తగ్గిపోయి,రాబడి తగ్గిపోయి. గోపీ పట్నంలో మంచి ఉద్యోగం చేస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నాడని తెలిసినా కొడుకుని నోరు తెరిచి ఒక్కపైసా కావాలని అడిగేవాడు కాదు.

గోపీ తల్లిదండ్రులకు తెలియకుండా తను ప్రేమించిన పిల్లను పెళ్ళాడిన కొన్నాళ్ళ వరకు కొల్లూరు రాలేదు. రెండు చేతులా బాగా సంపాదించడం మొదలు పెట్టిన తరువాత తరచు వస్తూండేవాడు. వచ్చినపుడల్లా ఏవేవో కొత్త సామానులు తెస్తూండేవాడు.

ఒకసారి వచ్చినప్పుడు మిక్సీని తీసుకొచ్చాడు. తను తెచ్చిన వస్తువునిగొప్పగా చూపిస్తూ "నాన్నా! అమ్మ రోట్లో రుబ్బుకోలేకపోతున్నదని మిక్సీ పట్టుకొచ్చాను. ధర పన్నెండువందలుపైనే అయింది"అన్న కొడుకు మాటలకు అంత డబ్బు దానికెందుకు దండగచేశావన్నట్టుగా చూశాడే కాని ఒక్కమాటకూడా బయటికిచెప్పలేదు.

గది గుమ్మం దగ్గర కూర్చున్న పర్వతం మాత్రం "బాగానే వుంది నువ్వు తెచ్చిన మిక్సీ. కాని మీ అమ్మ దాంట్లో వేసి రుబ్బేందుకు మినప్పప్పు మాత్రం లేమరా ఇంట్లో! అది ఒక బస్తా కొనుక్కురాలేకపోయావా?"కాస్త ఎగతాళిగా అని "వురేయ్ గోపీ. ఆ డబ్బు మీ నాన్నకిస్తే మూడునెలల బట్టీ పచారీ కొట్లో పేరుకున్న బాకీ తీర్చేవాడు కదరా!" అనేప్పటికి వెంకటశాస్త్రి "నువ్వూరుకోవే పర్వతం..!" అంటే "ఎందుకురా నా నోరు నొక్కుతావు?ఇంటి పరిస్థితిఎవరూచెప్పకపోతేవాడికెట్లాతెలుస్తుందిరా? పప్పు వుంటే బియ్యం వుండవు. రెండూ వుంటే కట్టెలుండవు. ఇట్లాంటి పరిస్థితులలో మిక్సీకి పన్నెండువందలు వృధాగా ఖర్చుపెట్టాడే అనీదే నా బాధ." "అంత మీకు బాధగా వుంటే మీరు అడుకోవచ్చునుగా!" "రెండు చేతులా సంపాదించే కొడుకు వుండగా నేనెందుకు అడుకోవాలిరా?" "అయినాఇప్పుడునాన్నకొచ్చిన లోటేమిటి? మీరు వూరికే ఈర్ష్యపడి పోతున్నారు. మా మీద!" "ఓరి అప్రాచ్యుడా నాకు ఈర్ష్య ఏమిట్రా! పెళ్ళీడుకొచ్చిన ఇద్దరు కూతుళ్ళు. కాలేజీలో చదువుతున్న ముగ్గురు తమ్ముళ్ళకి నెలనెలా డబ్బుపంపే టప్పటికి గుడ్లు వెళ్ళుకొస్తున్నయ్యి....." "వుసేయ్: నువ్వు నోరు మూస్తావా. లేదా!" "నువ్వుండరా శాస్త్రీ, నన్ను చెప్పనీ! ఇది వరకు మీ నాన్న తినే తిండి ఎవరైనా చూస్తే కళ్ళు వడతయ్యాని భయపడేదాన్ని-నా భయం నిజమైనట్లున్నది. వాడు ఇప్పుడు పట్టెడుమెతుకులు కూడా తినలేక పోతున్నాడురా గోపీ! మొన్న ఆ శ్యామసుందరంగారింట తద్దినం భోక్తగా కూర్చుని, రెండు ముద్దలుకూడ మింగలేక పోతే. "ఏమిట్రా ఇది"అని అడిగితే. "ఏమోనే పర్వతం. ముద్ద మింగుడు పడడం లేదు"అంటూసమాధానంచెప్పాడు...

పార్వతిని ఆ మాటలు కదల్చి వేసినయ్యి.

"ఈయన భార్యనైన నాతో కూడా చెప్పకోలేదే!' భర్త ఆరోగ్య స్థితి సరాయి అద దాని నోటినుంచి వినవలసి తన దౌర్భాగ్యానికి బాధ పడింది. ఆ మాట భర్త నడిగితే శాస్త్రి.... "నా ఆరోగ్యం బాగు లేదనే బాధకంటే ఆమాట పర్వతం మూలంగా వినడం నీకు ఎక్కువ బాధకలిగించినట్లున్నదే!" అన్నాడు. పార్వతి మండేగుండెలలో ఆజ్యంపోసినట్లయింది ఆ మాట.

గోపీకి తండ్రి మాటలు కోపాన్ని తెప్పించినయ్యి.

"నాన్నా. మేమంతా పుట్టిపెరిగి పెద్దవాళ్ళయిన తరువాత ఇన్ని సంవత్సరాలలో ఒక్క పూట ఇంట్లో అన్నం తిన్నారా? ఒక్క రెండు నిముషాలు మాతో మాట్లాడేవారా? ఎప్పుడూ వృత్తి వృత్తి అంటూ అవిడను వెంటేసుకు తిరిగే వారేకాని-మాతో గడిపిందెప్పుడు మీరు? పైగా మీ ఆరోగ్యం గురించి మేము పట్టించుకోలేదని నింద మా మీద వేస్తున్నారే!

తెనాలి కాని. గుంటూరుకాని తీసికెళ్ళి మిమ్మల్ని డాక్టరుకి చూపిస్తాను పదండి" అన్న కొడుకువెంట వెళ్ళి వైద్యంచేయించుకునేందుకు అతను మొండిగా ఒప్పుకోలేదు.

ఏదో మామూలు గొంతునొప్పి అని పార్వతమ్మ మిరియాల కషాయం కాచి ఇస్తూన్నది. వాటివల్ల గుణం కనిపించక బాధ ఎక్కువై పోతే గుంటూరు తీసుకెళ్ళి చూపిస్తే త్రోట్ కేన్సరనీ బాగా ముదిరిపోయిందని, రోజులు లెక్కపెట్టవచ్చని చెప్పటంతో శాస్త్రిని ఇంటికి తీసుకొచ్చేశారు పార్వతి. పర్వతం. వెంటనే గోపీకి టెలిగ్రాం ఇచ్చారు.

కాని గోపీ వచ్చేప్పటికి వెంకటశాస్త్రి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయినయ్యి.పార్వతమ్మ నోట్లో గుడ్డకుక్కుకుని మూలకిపోయి కూర్చుంది. ఆమె కళ్ళు రెండూ రెండు జలపాతాలే అయినయ్యి.

ఎడతెరిపి లేకుండా ఏడుస్తున్న పార్వతమ్మని ఓదార్చడానికి వెళ్ళిన పర్వతం మీద గోపీ గయ్యిన లేచాడు. "ఇదిగో చూడమ్మా. మహాతల్లీ! మా నాన్న బతికి వున్నన్నాళ్ళు జలగలాగా ఆయనను వదలకుండా పట్టుకున్నావు. ఇంకనైనా మమ్మల్ని వదిలివెడితే మీకు పుణ్యం వుంటుంది." అన్న గోపీ మాటలకు పర్వతం ఏమాత్రం కోపం తెచ్చుకోకుండా "వురేయ్ గోపీ నేను చచ్చిపోయేటంత వరకు ఈ ఇంట్లోనే వుండాలంటూ మీ నాన్న వీలునామా వ్రాశాడురా! ఈ కుటుంబ భారాన్నంతా నువ్వు మోస్తానని నాకు వ్రాసి ఇయ్యి-మీ నాన్న వీలునామా లెక్క చెయ్యకుండా నేనీ ఇంట్లోనుంచి వెళ్ళిపోతాను."

తండ్రి కర్మలకంటూ జోరుగా డబ్బు ఖర్చుపెట్టిన గోపీ పర్వతం మాటలకు ఏమీ


# శ్రీ వేంకటేశ్వర పూజావిధానము

**( A MINI ENCYCLOPEDIA ON LORD VENKATESWARA )**

కలియుగ వైకుంఠమైన తిరుపతి సందర్శించే యాత్రికులు చూడవలసిన ముఖ్య ప్రదేశములు. చేయవలసిన ముఖ్య విధులు—శ్రీవేంకటాచల. స్వామి పుష్కరిణి. ఇతర తీర్థముల మహాత్త్యములు—శనివారవ్రతము—దీపారాధన—వేదోక్త. పురాణోక్త పూజా విధానములు—సహస్ర నామావళి—శ్రీ వేంకటేశ్వర సుప్రభాతము—మహిమాన్వితములైన దివ్య స్తోత్రములు—అన్నమాచార్యుని అమరకృతులు—సమస్త శుభలక్షణ సమన్వితమైన శ్రీవారి త్రివర్ణ చిత్రపటముతో కూడిన సమగ్ర పూజా గ్రంథము. వెల : రు. 5-00 తపాలా ఖర్చులు అదనం.

ప్రవీణ్ పబ్లిషింగ్ హౌస్ 7-9-23, సాంబమూర్తి వీధి, రామారావుపేట,

కాకినాడ—533 004

జవాబు చెప్పలేదు.

"ఏమిరా మాట్లాడవు! పోయినవాడికోసం అంత డబ్బు ఖర్చు పెట్టావే! మరి బతికి వున్న వాళ్ళకి ఇంకా ఎంత బాగా ఖర్చు చేస్తావో!"

"నెలకు రెండువందలు పంపుతాను." "మరి చెల్లెళ్ళ పెళ్ళిళ్ళో!" "ఆ రోజు వస్తే అవే జరిగిపోతయ్యి." "బాగుంది రా వేదాంతం." "ఆ వేదాంతం మీరు చెప్పిందేగా! కల్యాణం వచ్చినా కక్కువచ్చినా ఆగదని తరచు అంటూండేవారుగా!" రమ. మిగిలిన పిల్లలందరు హాలులో ఒక మూల కూర్చుని అన్నగారు చెప్పే మాటలన్నీ ఆశ్చర్యంగా వింటున్నారు.

"నీ ఆఖరి నిర్ణయం ఇదేనా?" ఏం చెప్పమంటావన్నట్లుగా భార్యవైపు చూశాడు. ఆమె అంతే నన్నట్లు తల ఆడించగానే. "అః అంతే! నెలకి రెండువందలకి పైన ఒక్క నయాపైసకూడా పంపలేను!" "ఓహో ఇదంతా ఆవిడగారి చలవన్నమాట. నెలకి—రెండు వేలకుపైనే తెచ్చుకుంటున్నావు. మీ ఇద్దరికీ అంత అయితే మరీ ఆరు జీవాలు రెండు వందలలో ఎట్లా కాలక్షేపం చేస్తారనుకున్నావురా?"

అప్పుడు గోపీ భార్య కొంగుదోపుకుంటూ రంగ ప్రవేశం చేస్తూ "అక్కడ ఇంటి అద్దె. రోజూ బస్సులకి రెండు వేలు కాదుకదా. ఇంకో రెండు వేలైనా సరిపోవు!"

"అట్లాగా అమ్మా. ఆ రెండు పందలు కూడా మీరే వుంచుకోండి. నాయనా గోపీ వేలకువేలు ఖర్చు పెట్టి మీ నాన్నకి కర్మ చేసినంత మాత్రాన వాడి ఆత్మశాంతించదురా! ఆ డబ్బు పెట్టి కుటుంబంలోని నీ చెల్లెళ్ళకో, తమ్ముళ్ళకో, అమ్మకో ఏదైనా కొనిపెడితే వాడి ఆత్మ సంతోషించేదిరా! మీ నాన్నతో నేను ఒకసారి "వురేయ్. నువ్వు అన్నం తినలేకపోతే తద్దినం భోక్తగాను, ద్వాదశి బ్రాహ్మణుడుగాను వెళ్ళద్దురా" అంటే ఏమన్నాడో తెలుసునా? "వురేయ్ పర్వతం నేను భోజనం కోసం వెళ్ళడం లేదే! ఆ తరువాత వాళ్ళిచ్చే ఘనమైన దక్షిణ కోసం ఆశపడి వెడుతున్నానే! ఆ డబ్బుతో. పార్వతికి మూడో చీరకాని. రమ. రాధలకు. ఓణీలుకాని కొందామనే!" అనేవాడురా! నువ్వు బతికివున్న అమ్మ, చెల్లెళ్ళకి. తమ్ముళ్ళకు బట్టలున్నది లేనిది తెలుసుకోకుండా చచ్చిపోయిన నాన్న పేరు చెప్పి వూళ్ళో వాళ్ళని బాగుచేశావు."

ఆ మాటలకు గోపీకి చాలా కోపం వచ్చి "నాన్నగారిమీద అంత అపేక్షవుంటే మీరే ఆయన కుటుంబాన్ని ఆదుకోండి. పదిసార్లు నేను అనవసరంగా ఖర్చుచేశానని నన్నెందుకు ఆడిపోసుకుంటారు?"

"ఆహా. చాల చక్కటిమాట అన్నావురా. తండ్రికి. తల్లికీ ఒక్క మాటైనా చెప్పకుండా పెళ్ళి చేసుకున్న నువ్వా—చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు నువ్వేంచేస్తావురా? నేనే చేస్తాను. నా చిన్ననాటి నేస్తం కుటుంబాన్ని ఆదుకోవడం నా కర్తవ్యంగా భావిస్తానురా!"

"అయితే నెలనెలా నాన్నగారి మాసికాలు కూడా మీరే పెట్టండి."

"ఆ.... వాడికి మాసికాలు పెట్టనంత మాత్రాన పుట్టి మునిగేదేం లేదులే! బతికి వున్న వాళ్ళను వస్తులు పడుకోక్క పెట్టి. చచ్చిపోయినవాళ్ళ పేరుచెప్పి వూళ్ళో వాళ్ళని మేపక్కరలేదులే!"

"ఇహ నే నిక్కడ ఎందుకు వుండడం! రోహిణీ. మన సామానంతా సర్దెయ్యి. ఈ పూట బండికే వెళ్ళిపోదాం."

"వురేయ్ గోపీ. వచ్చే నెలలో రమకి పెళ్ళి నిశ్చయం చేస్తాను, చేసిన వెంటనే వుత్తరం వ్రాస్తాను. నీ భార్యని తీసుకుని వచ్చి నీ చెల్లెలి తలమీద నాలుగు అక్షింతలు వేసి వెళ్ళు-" అంటూ హెచ్చరించింది.

'ఏనాడూ ఆవిడను ఒక్క సారైనా మంచిగా తల్చుకొని ఒక్కమంచిమాట మాట్లాడలేదు. కన్నకొడుకే బాధ్యతలేకుండా వెళ్ళిపోతే. మా అందరినీ కష్టకాలంలో ఆదుకునే ఈమె స్నేహధర్మం ఎంత గొప్పది....' పార్వతమ్మ మనస్సులో బాధపడింది. తను ఏదైనా పనిచేసి సంపాదించాలని నిర్ణయించుకుని, "వదినగారూ. మినప్పప్పు. నూనె తీసుకొచ్చి ఇచ్చారంటే ఇంట్లో నే కూర్చుని అప్పడాలు వత్తి ఇస్తాను. మీరు వంట కెళ్ళే ఇళ్ళలో అమ్ముకురండి...." మొట్టమొదటి సారిగా ఆమెను భర్తకు సోదరి బంధుత్వం కలిపి "వదినగారూ" అంటూ సంబోధించింది.

"పార్వతీ! నువ్విట్లాంటి పనులేవీ చెయ్యక్కరలేదు. నీ పిల్లలకు తల్లిగా వుంటే చాలు. ఆ ప్లీడరుగారి దగ్గర పని చేస్తున్న గుమాస్తాగారికి పెళ్ళీడు కొడుకు వున్నాడు. మన రమ జాతకం ఇచ్చివస్తాను...అదేమిటే అట్లా ఆశ్చర్యంగా చూస్తున్నావు? నీ పిల్లల జాతకాలన్నీ నాదగ్గరే వున్నయ్యి...." పెట్టెలోంచి ఒక పుస్తకంతీసి అందులోంచి రమ జాతకం తీసుకు బయటకు వెడుతున్న పర్వతం వంక పార్వతి. ఆమె పిల్లలూ కృతజ్ఞతాపూర్వంగా చూస్తూ నిలుచుండిపోయారు.

విష్ణుశర్మ కథచెప్పడంముగించి "మిత్రలాభం అంటే అర్థం అయిందా?" అంటూ అడిగినదానికి రాజకుమారులందరూ 'అయిందన్నట్లుగా తలలు వూపారు.

